# మార్పు

**"కనక మహాలక్ష్మికి పెళ్ళయిపోయింది"**

అప్పుడే పోస్టుమాన్ తెచ్చిచ్చిన ఉత్తరం చదివిన సూర్యం అందులోని ముఖ్యమైన విషయాన్ని ఇంటిల్లపాదికీ వినబడేలా అరిచేడు. అవధాని తను చేస్తున్న పనిని ఆపి: ఠక్కున తలెత్తి చూసేడు. అతని చూపుల్లో కోపం, ఆశ్చర్యం, అనుమానం అన్నీ మిళితమై వున్నాయి.

"కనకానికి పెళ్ళి అయిపోయిందా? ఎక్కడ? ఎవరితో? ఇంతకీ-ఉత్తరం ఎవరు వ్రాసారు? చెప్పరా!"

"కనకానికి తిరుపతిలో పెళ్ళయింది. పెళ్ళికొడుకు పేరు; వివరాలు లేవు యిందులో. లలితత్త వ్రాసింది"

"అంటే... పెళ్ళి... అయిపోయేక వ్రాసిందన్నమాట! పెళ్ళికి రావాలని వుంటే పెళ్ళికి ముందే అందేలా వ్రాసివుండేది. కానీ మనం ఎవ్వరం పెళ్ళికి రావడం యిష్టం లేదన్నమాటేగా?" నిష్ఠూరం వెలువడింది సత్యవతి నోటివెంట.

"అంతేమరి. ముందే మనకీ కబురు తెల్సిపోతే వెళ్ళి పెళ్ళి ఆపేస్తాం అని భయం దానికి. ఆ కులం తక్కువ వాడికి కూతురినిచ్చి పెళ్ళిచేస్తానంటే వద్దన్నాం కదా, అందరమూనూ! అందుకే గప్‌చుప్‌గా పెళ్ళిచేసేసి పెళ్ళి అయిపోయేక ఉత్తరం ముక్క వ్రాసిపడేసింది" అవధానికి చెల్లెలిమీద పీకలదాకా కోపం వచ్చింది.

"ఏమంత ఖర్మ పట్టిందని! కనకం నిజంగా బంగారు బొమ్మ. బాపు బొమ్మలా వుంటుంది. మన వాళ్ళల్లోనే మంచి సంబంధాలు కొన్ని వున్నాయి. ఆ విశ్వనాథం గారబ్బాయి, బ్యాంకులో పన్చేస్తున్నాడు, వాడికి కనకాన్ని చేసుకుంటామని కబురు పెట్టారు కూడాను. ఈలోగా కొంపలు మునిగిపోతున్నట్టు వాడెవడికో యిచ్చి కట్టబెట్టేసింది. దీనికి అన్నింటికీ తొందరే!" విసుక్కుంటూ అన్నాడు అవధాని.

సత్యవతి గొణిగింది, "ఏమో మీరన్నట్టు కొంపలు మునిగిపోయే పరిస్థితి ఏర్పడి వుంటుంది. అందుకే అంత తొందరపడిపోయింది" ఆవిడ గొణుగుడు ఎవరూ వినలేదు కాబట్టి సరిపోయింది.

"అప్పటికి ఏదో కోపంలో అలా అనేసినా పెళ్ళికి ముందే పిలిస్తే ఎవరో ఒకరమైనా వెళ్ళే వాళ్ళం కదా" సూర్యం ఉత్తరం మడిచి టేబుల్ డ్రాయర్లో పెడ్తూ అన్నాడు.

"వెళ్తార్రా, వెళ్తారు. నేను చచ్చినా అలాంటి ముదనష్టపు పెళ్ళిళ్ళు సమర్థించను. రేపు ఎప్పుడైనా అది మనింటికి వచ్చినా నేను దానితో మాట్లాడేది లేదు. అసలు అది మన గుమ్మం తొక్కడానికి వీల్లేదు" అవధాని రౌద్రరూపం దాల్చేడు. నిప్పులాంటి వంశం తమది. అలాంటిది ఇది చేసిన పనివల్ల పరువు ప్రతిష్ఠలు మంటగల్సిపోతున్నాయని చాలా బాధపడిపోతున్నాడు అవధాని.

నిజానికి అవధానికి చెల్లెలంటే పంచప్రాణాలు. భర్తపోయేడని ఆమె కన్నీరు మున్నీరుగా

విలపిస్తూంటే, అత్తవారెవరూ ఆదుకోకపోతే; తనే చెల్లెల్నీ-చెల్లెలి కూతుర్నీ తీసుకొచ్చి ఇంట్లో పెట్టుకున్నాడు. కనకాన్ని కాలేజీలో చేర్పించి చదువు చెప్పించాడు. ఆ తర్వాత కనకానికి తండ్రి పన్చేసిన ఆఫీసులో ఉద్యోగం ఇప్తే తల్లీ కూతుళ్ళు చోడవరం వెళ్ళిపోయేరు. చెల్లెలన్నా, చెల్లెలి కూతురన్నా విపరీతమైన అభిమానం. ఒక్కొక్కసారి సత్యవతి ఉడుక్కునేది. "మీ చెల్లెలిమీదున్న అభిమానంలో పదోవంతు అయినా నామీదుంటే బాగుణ్ణు. లేదంటే నేను మీ పెళ్ళాంగాకాక చెల్లెలిగా పుట్టివుంటే ఇంకా బాగుణ్ణు'' అని!

అవధానికి మతిమరుపు ఎక్కువ.

ఎప్పుడూ సత్యవతిని పేరుపెట్టి పిల్చేటప్పుడు అవధాని నాలుక చివర "లలితా'' అన్నపేరే వచ్చేది.

"సరి సరి. నా పేరు కూడా మర్చిపోతున్నారు. కొన్నాళ్ళకి నేను మీ పెళ్ళాన్ని అన్న సంగతే మర్చిపోతారులావుంది'' అంటూ దెప్పేది సత్యవతి.

పిల్లలు ముగ్గురూ నిశ్శబ్దంగా ఉండిపోయేరు.

"పోన్లెండి. తిరుపతి అంటే మాటలా!'' అంది సత్యవతి వాతావరణం తేలిక పర్చాలనే వుద్దేశంతో.

"అయినా అదేమంత కానిపని అని అంత మండిపడిపోతున్నారు. ఈ రోజుల్లో ఎవరింట్లో చూచినా, ఎవరినోట విన్నా ఇలాంటి పెళ్ళిళ్ళే. కనకం మనసిచ్చిన కుర్రాడికిచ్చి వేస్తే దాని జీవితం సుఖంగా ఉంటుందని మీ చెల్లెలు ఆశపడింది. పిల్లల సుఖసంతోషాల కంటే మనక్కావల్సినదింకేం ఉంది? సమయాన్ని బట్టి మనం సర్దుకుపోవాలిగాని బిగుసుక్కూర్చుంటే ఎలా? కాలంతోపాటు మనమూ మారాలి'' భర్తకి నచ్చజెప్తున్నట్టుగా అంది.

"నువ్వెన్ని చెప్పు, నాకు మాత్రం అది చేసిన పని ఏమాత్రం నచ్చలేదు. కనకం అంటే ఇంకా చిన్నపిల్ల. వయసు వేడిలో మంచీచెడూ తెల్సుకోలేదు. తొందరపడిందే అనుకో. అది దేనికి వుంది? కూతుర్ని మందలించి అదుపులో పెట్టుకోవద్దూ!''

"అయితే ఏమిటంటారు? అదేం లేచిపోలేదు కదా. లక్షణంగా శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో వివాహం జరిగింది. అయినా రేపు మన పిల్లలు ఏం చేస్తారో అది ఆలోచిం చండి ముందు. మీకూ ఆడపిల్లలు వున్నారు! అన్నీ మనిష్టప్రకారమే జరగాలంటే ఎలాగ? జరుగుతున్న వాటితో సర్దుకుపోయే స్వభావం మనం అలవర్చుకోవాలి. ఎదుటి వాళ్ళని ఒక వేలెత్తి చూపినప్పుడు మూడు వేళ్ళు మనవైపు వుంటాయన్న సంగతి మర్చి పోతున్నారు మీరు!''

"నోర్మూయ్యి! నా పిల్లలు అవనీ, ఎవరవనీ. అలాంటి కులం తక్కువ పన్లు చేస్తే ఇంట్లోంచి గెంటేస్తాను'' బాగా కోపం వచ్చింది పెళ్ళాంమీద.

వాళ్ల మాటలన్నీ వింటూన్న సూర్యం, సరోజ, సుధ గతుక్కుమన్నారు. బిక్క మొహాలేసుకుని వింటున్నారు.

వాళ్లకి తండ్రి అంటే చాలా భయం.

ఏది కావాలన్నా, ఏది చెప్పాలన్నా తల్లిదగ్గరకే వెళ్తారు...

"గెంటేయండి. అందర్నీ ఇంట్లోంచి గెంటేయండి. అందరిళ్ళలోనూ పిల్లలు ఎలాంటి తప్పుడు పన్లు చేసినా కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్నారు. ఎందుకో తెలుసా? పిల్లలకి దూరమై బ్రతకలేరు గనుక. వాళ్ళంతా వివేకవంతులు. విచక్షణా జ్ఞానం ఉన్నవాళ్ళు.మీ సంగతి అలాక్కాదు. మీకు పిల్లలకంటే పంతాలు-పట్టుదలలే ముఖ్యం"

"వాళ్ళంతా దద్దమ్మలు. ఏమీ చేతకాని వాళ్ళు. పిల్లల్ని ఎలా పెంచాలో అస్సలు తెలీదు వాళ్ళందరికీ. నా పిల్లలుగాని అలాంటి అప్రాచ్యపు పన్లు చేసారంటే పీక పిసికి చంపేస్తాను. తర్వాత నేనూ చస్తాను. అంతేకాని అలాంటి పెళ్ళిళ్ళకి వప్పుకోను" ఆవేశంతో వూగిపోతున్నాడు అవధాని.

సత్యవతికి అతని వాదన వింటూంటే ఎందుకో భయం కలిగింది.

"మనిషన్న తర్వాత మరీ ఇంత మొండితనం, పంతం పనికిరాదు. కొంచెం పట్టూ విడుపూ ఉండాలి. అన్న నోరే అనిపించుకుంటుంది అని!... అనకూడదుగాని రేపు మన పిల్లలు ఏదైనా మీకిష్టంలేని పనిచేసేరనుకోండి... వాళ్ళని చంపేస్తారుకదూ. బాగుంది. చాలా బాగుంది!" ఆవిడకి దుఃఖం తన్నుకొస్తోంది.

★ ★ ★

ఇది జరిగిన సంవత్సరం తర్వాత-

కనకం సంసారం బాగానే వుంది. ఒక కొడుకు పుట్టేడు.

అవధాని మాత్రం పూర్తిగా చితికిపోయాడు. దాదాపు పిచ్చివాడిలా తయారయ్యాడు. మొదటి కారణం సరోజ.

సరోజ అసలే చాలా భయస్తురాలు.

ఒక అబ్బాయితో ప్రేమలోపడి ఆ సంగతి తండ్రికి చెప్పే ధైర్యంలేక నిద్రమాత్రలు మింగి శాశ్వతంగా కళ్ళు మూసుకుంది.

సూర్యం, సుధ తండ్రితో మాట్లాడ్డం, ఎదుటపడ్డం మానుకున్నారు. తనింట్లో తననో శత్రువులా చూస్తూంటే, తన పిల్లలే తనని పరాయివాడిలా భావిస్తుంటే అవధాని భరించలేకపోయేడు.

ప్రతి నిముషం కళ్లముందు సరోజ అమాయకమైన చూపు మెదుల్తూంటే గుండెని ఎవరో మెలితిప్పినట్టుగా వుంది అతనికి. అంతటి కరకు హృదయమూ కరిగిపోయింది.

ఏడ్చేడు!

కుళ్ళి కుళ్ళి ఏడ్చేడు!

మనసులోవున్న కల్మషమంతా కడుక్కుపోయేలా భోరుమని ఏడ్చేడు! కన్న కూతురి మరణం అవధాని మనసుని ముక్కలు ముక్కలుగా చేసింది. పూర్తిగా కుంగిపోయేడు. సూర్యం, సుధల తిరస్కారం అంతకంటే ఎక్కువగా హృదయాన్ని రంపపు కోత కోస్తున్నది.

పిల్లలతో మాట్లాడకుండా, పిల్లలచేత 'నాన్నా' అని పిలిపించుకోకుండా... ఒక జడ పదార్థంలా బ్రతుకుతున్నాడు.

వద్దువద్దు. తను ఈ నిర్లిప్తతని భరించలేడు.

తనకి పిల్లలు కావాలి. పిల్లలు కావాలి.

సరోజా! తల్లీ...! తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయావా?

తన అవివేకానికి ఆ అమాయకురాలు అనవసరంగా బలైపోయిందన్న భావనే అతన్ని నిలువనీయడం లేదు.

తను హంతకుడు. నేరస్తుడు. తన పాపానికి నిష్కృతి అంటూ ఏదీ లేదు. అవధానికి ఆలోచిస్తున్నకొద్దీ మతిపోతోంది.

తనలాంటి వాళ్ళకు ఏశిక్ష విధించినా చాలదు.

అవధాని పశ్చాత్తాపాగ్నిలో దహించుకుపోతున్నాడు.

ఆఖరికి ఒకరోజు "సత్యవతీ! లలితనీ, కనకాన్నీ రమ్మని కబురుపెట్టు. వాళ్ళని చూసి ఎన్నాళ్ళో అయిపోయింది. కనకానికి కొడుకుట కదా! చంటివాణ్ణీ, దాని మొగుణ్ణీ! కూడా తీసుకురమ్మను" అని ఎంతో బేలగా చెప్పేడు.

సత్యవతికి దుఃఖంతో నోటమాట రాలేదు.

తండ్రిలో వచ్చిన మార్పు పిల్లలు అర్థం చేసుకున్నారు. నెమ్మదిగా తండ్రి దగ్గరకు వచ్చి అటూ-ఇటూ నించుని "నాన్నా" అని పిలిచేరు. అంతే! అతని గుండె కరిగి పోయింది.

అతనిలోని వాత్సల్యం గట్టుతెగిన వాగులా ప్రవహిస్తూంటే పిల్లలిద్దర్నీ ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నాడు. అలా ఎంతసేపు వుండిపోయేరో వాళ్ళకే తెలీదు.

★ ★ ★

*(ఆంధ్రజ్యోతి, వీక్లీ ; 30-6-1995)*